

డ్వాక్రా భవనానికి రూ.10 లక్షలు మంజూరు


శ్రీనివాసులురెడ్డిని సన్మానిస్తున్న డ్వాక్రా మహిళలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

డ్వాక్రా మహిళా సంఘాల భవన నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ పోలీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం పురపాలక కార్యాలయంలో జరిగిన సాధారణ సమావేశం నిర్వహించారు. డ్వాక్రా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యకు నేటితో పరిష్కారం దొరకడంతో డ్వాక్రా మహిళలు పోలాను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, వైసిపి నాయకులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం : ఎస్‌పి

ప్రజాశక్తి-రాయచోటి రూరల్

జాతిపిత మహాత్మ గాంధీ చూపిన మార్గాన్ని మనమందరం అనుసరించాలని ఎస్‌పి బి.కృష్ణారావు అన్నారు. మంగళవారం మహాత్మా గాంధీ 76వ వర్ధంతి సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మహాత్మ గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యానికి పోరాడిన గొప్ప వ్యక్తి గాంధీజీ అన్నారు. సత్యం, అహింస గాంధీజీ నమ్మే సిద్ధాంతలు అయితే, సహాయ నిరాకరణ, సత్యాగ్రహం ఆయన ఆయుధాలన్నారు. నూలు వడికి, మురికివాడలు శుభ్రంచేస్తూ, అన్నికులాలు, మతాలు ఒకటేనని చెప్పిన మహాను భావుడన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా దేశంపై చెరగని ముద్ర వేసిన గాంధీజీ 1948 జనవరి 30న హత్యకు గురయ్యారన్నారు. బాపూజీ చూపిన సత్యం, అహింస మార్గాలు భావితరాలకు బంగారు బాటలుగా నిలిచాయని తెలిపారు. గాంధీ సిద్ధాంతాలు, ఆశయాలు అందరికీ స్ఫూర్తిదాయకం. మహాత్ముడి పోరాటం ప్రపంచమంతటికీ ఆదర్శమేనని పేర్కొన్నారు. సామాన్య కుటుంబంలో జన్మించి మహోన్నత వ్యక్తిగా అవతరించారని తెలిపారు. కార్యక్రమంలో ఎఆర్ ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య, దిశ సిఐ చంద్ర శేఖర్, ఎస్ఐలు, పోలీసు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. **మదనపల్లి :** మహాత్మా గాంధీజీ 76వ వర్ధంతి సందర్భంగా వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పులి శ్రీనివాసులు సబ్ కలెక్టర్ కార్యాలయంలో జాతిపిత గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం, అహింస, సత్యాగ్రహం అనే ఆయుధాలతో భారతదేశానికి బ్రిటిష్ వారి నుంచి స్వాతంత్రం తెచ్చారని కొని యాడారు. ప్రతి ఒక్కరూ ఆ మహనీయుని అడుగుజాడల్లో మనమందరం నడవాలని కోరారు. సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభాయ్ పటేల్, భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, ఆసిఫుల్లాఖాన్ అనేకమంది ప్రాణాలను అర్పించి భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చారని సమరయోధుల త్యాగఫలాన్ని అనుభవిస్తున్న ప్రతి ఒక్క భారతీయుడు వారి అడుగుజాడల్లో నడవాలని తెలిపారు. కార్యక్రమంలో సద్దల జయసింహ, వలసల మంజునాథ్, కలిచర్ల నరసింహులు, బొంత రామకృష్ణ, కోనే వెంకటరమణ, రాజు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** స్వాతంత్ర్య సమరయోధులు జాతిపిత మహాత్మా గాంధీజీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని టోల్గేట్ సెంటర్‌లోని గాంధీజీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష,కార్యదర్శులు గునిశెట్టి రమేష్, చలపాటిహరినాథ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు మేడా వెంకటసుబ్బయ్య, కామిశెట్టి పార్థసారథి, గునిశెట్టిసాయి, కామిశెట్టి సత్య, నరసింహ, శరత్ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా యల్లటూరు భవన్‌లో శ్రీనివాసరాజు గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. వలస వాదుల చెర నుంచి అఖండ భారతావనికి విముక్తి కలిగించి ప్రపంచానికి నూతన పోరాట కొరవడిని నేర్పిన దీశాలి జాతిపిత మహాత్మా గాంధీ అని కొనియాడారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, మాజీ జెడ్పిటిసి యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, పత్తి నారాయణ, నారదాసు రామచంద్ర, తోట సురేష్, శంకర్ రాజు, మౌల, చక్రి పాల్గొన్నారు. **సుండుపల్లి :** స్థానిక నాలుగు రోడ్ల కూడలి సర్కిల్ లో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి రాజంపేట అసెంబ్లీ పార్లమెంట్ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు రామాశ్రీనివాస్ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ తెలుగుదేశం వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి ఎం దామోదర్‌నాయుడు, గ్రామ అధ్యక్షుడు చెన్నం శెట్టి వెంకటరమణ, సుబ్బ రామ, మాజీ ఎంపిటిసి నంద్యాల రామయ్య, సీనియర్ నాయకులు ఆనంద్ రెడ్డి, బలిజ సంఘం నాయకులు గుగ్గిల కృష్ణయ్య, దళిత నాయకులు, వీర నాగయ్య, ఈశ్వర్, మహదేవ పాల్గొన్నారు.


గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌పి కృష్ణారావు

మహిళలకు వరం వైఎస్ఆర్ ఆసరా : 'గడికోట'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, వైఎస్ఆర్ ఆసరా వారికి వరంగా మారిందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రభుత్వ కళాశాల మైదానంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జగన్ పాలనలో పేదరికం తగ్గిందన్నారు. డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నామని తెలిపారు. చంద్రబాబు హయాంలో డ్వాక్రా సంఘాలు ఎ, బి గ్రేడులు 19 శాతం మాత్రమే ఉన్నాయని, జగన్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలవల్ల డ్వాక్రా సంఘాల ఎ, బి గ్రేడులు 90 శాతానికి పైగా చేరాయన్నారు. రూ.5 లక్షల ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం ఒక రికార్డన్నారు. రాయచోటి మున్సిపాలిటీలో వైఎస్ఆర్ నాల్గవ విడత కింద 745 సంఘాలకు రూ.5.34 కోట్లు, రూరల్ మండలంలో 424 సంఘాలకు రూ.3,14,08,783 లబ్ధి చేకూరిందన్నారు. ఎవ్వరి ప్రమేయం లేకుండా అర్హుల ఖాతాలలో డబ్బులు పడటం, సంక్షేమ పథకాల కోసం ఎవ్వరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చేశారన్నారు. ప్రతి ఇంటికి మూడు, నాలుగు పథకాల లబ్ది చేకూరడం వైసిపి పాలనలో జనం మెచ్చిన మార్పులని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజర్ రెహమాన్, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు వండాడి వెంకటేశ్వర్లు, కర్ణపు విశ్వనాథరెడ్డి, స్టేట్ సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, జడ్పిటిసి వెంకటేశ్వరరెడ్డి, ఎపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్ ఖాన్, మున్సిపల్ మకిషనర్ గంగాప్రసాద్, ఎంపిడిఒ మల్‌రెడ్డి, డిఆర్‌డిఎ ఇన్‌ఛార్జి పీడీ సత్యనారాయణ, కౌన్సిలర్లు ఫయాజ్ అహమ్మద్, కొలిమి చాన్ బాష, ఆసీఫ్ అలీ ఖాన్, కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, జాకీర్, రౌనక్, గౌస్ ఖాన్, మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, మెప్మా అధికారులు నాగరాజు, అబ్బాస్, డిఆర్‌డిఎ అధికారి శ్రీనివాసులురెడ్డి, పాల్గొన్నారు.



మహిళలకు చెక్కును అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

హోరాహోరీగా జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు


తలపడుతున్న రాజస్థాన్, కర్ణాటక జట్లు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అండర్-14 బాలికల జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు ఇన్ఫాంట్ జీసస్ హైస్కూల్‌లో రసవత్తరంగా కొనసాగుతున్నాయి. మంగళవారం మూడవ రోజు పోటీలలో భాగంగా ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ జట్ల మధ్య పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభ మ్యాచ్లో ఛత్తీస్‌గఢ్ 26 పాయింట్ల తేడాతో గెలుపొందింది. కోర్టు నెంబర్ రెండులో తమిళనాడు, తెలంగాణ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో విచిత్రమైన మలుపుల మధ్యన చివరికి ఇద్దరికీ 56 పాయింట్లు రావడంతో మ్యాచ్ టైగా ముగిసింది. గోవా, విద్యా భారతి జట్ల మధ్య జరిగిన పోటీలో 33 పాయింట్లు తేడాతో విద్యా భారతి జట్టు గెలుపొందింది. చండీగఢ్, హిమాచల్‌ప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 69 పాయింటులతో హిమాచల్‌ప్రదేశ్ విజయం సాధించింది. కర్ణాటక, రాజస్థాన్‌ల మధ్య జరిగిన పోటీలో 13 పాయింట్లు తేడాతో రాజస్థాన్ గెలుపొందింది. ఎన్‌విఎస్, మహారాష్ట్ర జట్ల మధ్య జరిగిన పోటీల్లో 35 పాయింట్లు తేడాతో మహారాష్ట్ర గెలుపొందింది. గుజరాత్, మధ్యప్రదేశ్ మధ్య జరిగిన పోటీలో నాలుగు పాయింట్లు తేడాతో గుజరాత్ గెలుపొందింది. మూడవ రోజు పోటీలకు ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి వి.శేఖర్, డైట్ కళాశాల అధ్యాపకులు జయరాం నాయుడు, రాజంపేట వైష్ణవి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పోలా రమణారెడ్డి, రాజంపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మర్రి రవి, కడప జియాన్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కరస్పాండెంట్ రాజారత్నం ఐజాక్, పిఇటిలు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలకు ముందు ఆర్‌ఐపి ఇ.భానుమూర్తి రాజు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని తెలిపారు.

కరోనా అమరవీరుల సేవలు చిరస్మరణీయం


మదనపల్లె : కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-పీలేరు

కరోనా అమరవీరుల సేవలు చిరస్మరణీయమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) పీలేరు బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఐఎంఎ కోవిడ్ అమరవీరుల దినోత్సవం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ వ్యతిరేక పోరాటంలో తమ యూనియన్ దేశ వ్యాప్తంగా 124 మందిని కోల్పోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఈశ్వరసురేంద్ర, డాక్టర్ శ్రీలత, డాక్టర్ ఎల్లయ్య పాల్గొన్నారు. **మదనపల్లి:** కరోనా మహమ్మారితో ప్రాణాలు కోల్పోయిన వైద్య సిబ్బంది ఆత్మలకు శాంతి కలగాలని మంగళవారం జిల్లా ఆసుపత్రిలో వైద్య సిబ్బంది క్యాండిల్స్ వెలిగించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం మదనపల్లి మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జమున, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి, ఆర్ఎంఒ డాక్టర్ ప్రసాద్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి, రోగులకు వైద్యం చేస్తూ మృతి చెందారని తెలిపారు. అంకితభావంతో ప్రాణాలకు తెగించి వైద్యం చేయడమే కాకుండా తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వైస్ ప్రిన్సిపల్

ఓటు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ వ్యవస్థాపకులు, విశ్రాంత తహశీల్దార్ పి.వెంకటరమణ విద్యార్థులకు ఓటు విలువ, వినియోగంపై అవగాహన కల్పించారు. ఓటుకు నోటు ప్రజాస్వామ్యానికి ప్రమాదమని, ఓటుకు నోటు తీసుకుంటే అభివృద్ధి గురించి అడగలేమని పేర్చొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాట్లాడిన విద్యార్థులకు బహుమతులు అందజేసి ప్రోత్సాహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకట నరసయ్య, సిబ్బంది బి.నాగరాజ, హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు మణి, శరత్, గంగ రాజు పాల్గొన్నారు.

నంది పురస్కార గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి-పీలేరు

జాతీయ స్థాయి నంది పురస్కార అవార్డు గ్రహీత పాత్రికేయులు, అంతర్జాతీయ బహుభాషా నాటక రంగ కళాకారులు ఖాదర్ బాష షేక్‌ను యుటిఎఫ్ పీలేరు డివిజన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, సత్కరించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కావలిపల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన సన్మాన కార్యక్రమాన్ని ఉద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు సదాశివరెడ్డి, జిల్లా నాయకులు శివారెడ్డి, అక్రంబాష మాట్లాడుతూ ఖాదర్‌బాషా ఓ వైపు పత్రికా రంగంలో పాత్రికేయుడిగా పనిచేస్తూ మంచి కథనాలతో పాఠకులను, మరోవైపు కళాకారుడిగా సాంస్కృతిక రంగంలో అత్యుత్తమ అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ అందరి మన్ననలు అందుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, వేణుగోపాల్, కృష్ణమూర్తి, సుబ్రమణ్యం, విశ్వనాథరెడ్డి, కుమార్ రాజ, రహంతుల్లా, పి.సుధాకర్, ఆర్.సుధాకర్, భాస్కర్, మునిరత్నం, కళాకారులు సురేష్, సుహేల్, కీర్తి, అమ్ములు పాల్గొన్నారు.


ఖాదర్‌బాషాను సత్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఐసిడిఎస్‌లో ఖాళీ పోస్టులకు దరఖాస్తులు


ప్రజాశక్తి-రాయచోటి

మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖలో సఖి-వన్ స్టాప్ సెంటర్ పథకం కింద అన్నమయ్య జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయుటకు అర్హతగల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసిడిఎస్ జిల్లా ఇన్‌ఛార్జి పీడీ శశికళ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదరు పోస్టునకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు అవసమరమైన అర్హత, నిర్ణయ ప్రమాణాలు, దరఖాస్తు ఫారంలను http://kadapa.nic.in వెబ్‌సైట్ నుండి డౌన్లోడ్ చేసుకొని, పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, కెటిసి ఫంక్షన్ హాల్ ఎదురుగా, చెన్నముక్కపల్లి (జిపి), టి.సుండుపల్లి రోడ్, రాయచోటి యందు ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం 05.00 గంటల్లోపు అందునట్లుగా పంపాలని పేర్కొన్నారు.

మహిళకు రక్తదానం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పీలేరు పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పావని అనే మహిళకు ఎ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో ఆమె కుటుంబ సభ్యులు బ్లడ్ మోటివేటర్ డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్‌ను సంప్రదించారు. మంగళవారం అల్లాబకష్ అనే యువకుడితో దీప బ్లడ్ బ్యాంక్‌తో రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకుడికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అబుజర్ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న అల్లాబకష్

నాలుగేళ్ల చిన్నారిపై అఘాయిత్యం

ప్రజాశక్తి-గాలివీడు

అభం శుభం తెలియజని ఓ నాలుగేళ్ల చిన్నారిపై మంగళవారం 55 ఏళ్ల వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడిన ఘటన మండలంలోని కమలామర్రి పరిధిలోని పెద్దపల్లి గ్రామం చోటు చేసుకుంది. ప్రతిరోజు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి చదువుకుంటోంది. ప్రతి రోజులాగానే మంగళవారం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. బడి నుంచి ఇంటికి వచ్చిన చిన్నారి జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పంది. చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డ రెడ్డెప్పపై చిన్నారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైద్య పరీక్షల నిమ్మితం రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి బాలికను తీసుకువెళ్లారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మానభంగం, పోక్సో కేసు నమోదు చేసి నిందితుని కొరకు గాలింపు చర్యలు చేపట్టామని రాయచోటి డిఎస్‌పి మహబూబ్‌బాషా తెలిపారు. ఆ గ్రామానికి వెళ్లి ముద్దాయిలను సాక్ష్యాలను విచారించామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ముద్దాయిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతామని తెలిపారు. విలేకరుల సమావేశంలో లక్కిరెడ్డిపల్లి సిఐ జి.జె.గంగనాథ్ బాబు, ఎస్ఐ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

చిన్నారిపై అఘాయిత్యం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈ సంఘటన మనసును కలచివేసిందన్నారు. మానవత్వం మంట కలిసి పోయేలా ఒక మానవ మృగం పసిపాపపై అత్యాచారానికి పాల్పడడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో ముస్లిం మైనార్టీ నాయకులు మహబూబ్ వలీ, వేమిరెడ్డి సుబ్బారెడ్డి, వేమిరెడ్డి మోహన్‌రెడ్డి, మూగి శ్రీరాములు, కలాడి వినయ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

భారతరత్న అవార్డు గ్రహీత ఠాకూర్‌కు ఘననివాళి

ప్రజాశక్తి-మదనపల్లి

బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం అవార్డు ప్రకటించడం జాతికి గర్వకారణమని నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం ఠాకూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తమ జాతీకి గుర్తించి భారతరత్న అవార్డు కేటాయించడం ప్రధానమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్లంపల్లి ప్రశాంత్ మాట్లాడుతూ అనగారిన వర్గాలకు చెందిన ఠాకూర్ తమ జీవిత విధానంగా మార్చుకొని దేశంలోనే మొట్టమొదటి బిసిలకు 26 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత, సంపూర్ణ మద్యపాన నిషేదం చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో నాయకులు అజ్మతుల్ల ఖాన్, రవికుమార్, బ్రాహ్మణ సంఘం నాయకులు శంకర్ సదాశివ కృష్ణమూర్తి గంగాధర్ మంజునాథ్ వెంకటేష్ పాల్గొన్నారు.


చైర్‌పర్సన్‌కు సమస్యలు వివరిస్తున్న వైస్ చైర్మన్

వార్డుల్లోని సమస్యలను గుర్తించండి

- మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజరెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె

కౌన్సిలర్లు తమ తమ వార్డులలోని సమస్యలను గుర్తించి వాటిని తన దృష్టికి తీసుకురావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సాధారణ, అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని, ఎన్నికలు ఉన్నందున ప్రతి కౌన్సిలరు తమ వార్డుల్లో సమస్యలను గుర్తించి, అభివృద్ధి పనుల గురించి తనకు తెలియజేసినట్లయితే వాటిని పరిష్కరించేందుకు కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి మాట్లాడుతూ పట్టణంలో శ్మశాన వాటికలకు కేటాయించిన నిధులు వెచ్చించిన నిధులు గురించి తెలియజేయాలని కోరడంతో కమిషనర్ ప్రమీల వివరించారు. శ్మశాన వాటికలకు ఉన్న నిధులను పూర్తిచేయాలన్నారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని వైస్ చైర్మన్ నూర్ ఆజాం మాట్లాడుతూ వీటి పరిష్కారం కోసం ప్రత్యేక కృషి చేయాలని కోరారు. సమావేశంలో సాధారణ కౌన్సిల్ అజెండాలోని 46 అంశాలతో పాటు అత్యవసర సమావేశంలోని ఒక్క అజెండాతోపాటు 47 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో 'జ్ఞానాంబికా' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లి

ఎస్వీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన అంతర్ యూనివర్సిటీ క్రీడా పోటీలలో జ్ఞానాంబికా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కరెస్పాండంట్ డాక్టర్ గురుప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 100 మీటర్ల పరుగు పందెంలో కె.రుచిత బంగారు పతకం, 200 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం, 100 మీటర్ల హార్డిల్స్‌లో రజత పతకం సాధించిందన్నారు. 4×100 రిలే పరుగు పందెంలో రుచిత, మానస, సుజిత, కీర్తన కలసి రజక పతకం సాధించరన్నారు. జావలిన్ త్రో పోటీల్లో సుమంత్ రజత పతకం, 1500 మీటర్ల పరుగు పందెంలో పద్మశ్రీ రజత పతకం సాధించిందని పేర్కొన్నారు. ఇటీవల నియోజకవర్గం స్థాయిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర పోటీలలో బాలికల విభాగంలో రామారావు కాలనీ, ఎస్‌బిఐ కాలనీ సచివాలయం తరపున పాల్గొని కబడ్డీ, క్రికెట్ క్రీడల్లో విజేతగా కప్పు సాధించారన్నారు. ఖోఖో క్రీడలో రనర్స్‌గా నిలిచారని పేర్కొన్నారు. క్రీడల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపల్ రమాదేవి, పీడీ శరత్ నాయక్, అభినందించారు. క్రీడాకారులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని చెప్పారు. క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.


ప్రతిభ చూపిన విద్యార్థులతో కరెస్పాండెంట్ గురుప్రసాద్

'జనాదరణ చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు'

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన సభలకు వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేకే వైసిపి ప్రభుత్వం ప్రతిపక్షాలపై అక్రమ కేసులకు పాల్పడుతోందని రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి కోటపల్లె బాబురెడ్డి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం పీలేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి శ్రేణులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందరర్భంగా వారు మాట్లాడుతూ కక్ష సాధింపు చర్యలతో తెలుగుదేశం పార్టీ ప్రముఖ నాయకులతోపాటు ఆఖరికి ప్రధాన ప్రతిపక్ష నేత చంద్రబాబుపై అక్రమ కేసులు నమోదు చేసి 52 రోజులపాటు చేయని తప్పుకు శిక్ష అనుభవించేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబుపై నమోదు చేసిన కేసుల్లో బెయిల్ రద్దు చేయాలని అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ వేసిన వైసీపీ ప్రభుత్వానికి చుక్కెదురైందని, ఇది జగన్మోహన్ రెడ్డికి ఒక చంపపెట్టని అన్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను చంద్రబాబు ప్రజల్లోకి తీసుకుపోతున్నందుకే అక్రమ కేసులు నమోదు చేయడం, బెదిరింపులకు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడడం సబబుకాదని హితవుపలికారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు, మహిళలకు రక్షణ కరువైందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్న ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వారణాసి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు యల్లెల రెడ్డెప్పరెడ్డి, జయచంద్రారెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి స్పోర్ట్స్ మల్లి, ప్రముఖ నేత కొత్తపల్లి శ్రీనాద్ రెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, మండల తెలుగు యువత అధ్యక్షులు రియాజ్, కెజిఎన్ రెడ్డిబాష, రమణా రెడ్డి, సుబ్బయ్య, షౌఖత్, బిసి మండల అధ్యక్షులు అప్పస్వామి, కృష్ణయ్య, భాస్కర, వెంకటేష్, శ్రీరాములు, రెడ్డిముని, గురుమోహన, అబ్బవరం సురేష్, వెంకట రమణ నాయక్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి అధికార ప్రతినిధి బాబురెడ్డి



సమ్మక్కకు చెక్కును అందిస్తున్న సాయివికాస్‌రెడ్డి

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకునేందుకు ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని ముక్కా రూపానందరెడ్డి తనయుడు సాయివికాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తిప్పాయపల్లె గ్రామంలో గత మూడు సంవత్సరాల నుంచి మంచానికే పరిమితమై ఉన్న దిండు రమేష్‌రెడ్డి కుటుంబానికి రూ.30 వేలు ఆర్థికసాయం అందించారు. అదే గ్రామానికి చెందిన కొండలక్కగారి సక్కమ్మకు గత మూడు సంవత్సరాల నుంచి పూర్తిగా కంటి చూపు కోల్పోవడంతో ఆదుకునే వారు ఎవ్వరూ లేకపోవడం తెలుసుకొని రూ.15వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిరెడ్డి, అంజిరెడ్డి, వెంకటరమణారెడ్డి, సుబ్బారెడ్డి, మల్లికార్జునరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ముక్కావారిపల్లి సర్పంచ్ అరవ శ్రీధర్, కిరణ్ కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలం పాట వాయిదా

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

సామకోటవారిపల్లి గ్రామంలోని చేపల చెరువులకు నిర్వహించాల్సిన బహిరంగ వేలంపాట ఫిబ్రవరి 5వ తేదీ సోమవారంకు వాయిదా వేసినట్లు ఇఒపిఆర్‌డి చలపతిరావు, సర్పంచ్ మహాదేవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేపల ఫలసాయానికి సామకోటవారిపల్లి గ్రామంలోని చెరువులకు వేలంపాటను మంగళవారం నిర్వహించాల్సి ఉండగా, కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగమల్లి పాల్గొన్నారు.

పట్టణ ఎస్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



రాజంపేట పట్టణ ఎస్‌ఐగా మంగళవారం ఎ.వెంకటేశ్వర్లు బాధ్య తలు చేపట్టారు. ఈయన గతంలో రైల్వేకోడూరు, ఓబుల వారిపల్లెలో ఎస్‌ఐగా విధులు నిర్వహిం చారు. ఎన్నికల బదిలీలో భాగంగా రైల్వే కోడూరు నుంచి రాజంపేటకు వచ్చారు. నూత నంగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐకు పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతల పరి రక్షణకు కృషి చేస్తానని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేదని అన్నారు.



సిఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

పేదలకు వరం సిఎం సహాయనిధి : 'కొరముట్ల'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో పార్లమెంటు సభ్యులు పివి.మిథున్‌రెడ్డి చొరవతో రూ.10లక్షలు విలువ చేసే సిఎం సహాయనిధి చెక్కులను కొరముట్ల లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు క్లాస్‌వన్ కాంట్రాక్టర్ పాటూరి శ్రీనివాసులురెడ్డి, ఎపి టూరిజం డైరెక్టర్ మందల నాగేంద్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధా కర్‌రాజు, ఉప సర్పంచ్ తోట శివసాయి, వీరనారాయణరెడ్డి, పట్టణ కన్వీనర్ రమేష్ పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపిడిఒ సురేంద్రనాథ్

సర్వే సక్రమంగా పూర్తి చేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో చేపట్టిన కులగణన సర్వే సక్రమంగా త్వరగా పూర్తిచే యాలని ఎంపిడిఒ సురేంద్రనాథ్ తెలిపారు. మంగళవారం పరస్తోపు గ్రామపంచాయతీలో జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని తనకి చేశారు. కులగణన సర్వే యాప్‌లో ఉన్న సమాచారాన్ని ఇంటింటికి వెళ్లి వారు తెలి పిన సమాచారాన్ని అందులో పొందుపరచాలన్నారు. 5వ తేదీ లోపు సర్వే పూర్తి చేయాలని సూచించారు.



ఫ్లెక్సీ బోర్డులు బారికేడ్లను ప్రారంభిస్తున్న డిఎస్‌పి

బారికేడ్లు వితరణ

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలో ట్రాఫిక్ నియంత్రణకు మెడికల్‌షాప్ యూనియన్ ఆధ్వర్యంలో పది ఫ్లెక్సీబోర్డులు, పది బారికేడ్‌లను అందించడం అభినందనీయమని డిఎస్‌పి మహబూబ్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఆర్‌ఎంపి వైద్యులు, మెడికల్‌షాప్ యాజమాన్యాల ఆధ్వర్యంలో బారికెట్లు ప్రారంభించారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి సిఐ డిజె.గంగానాథ్‌బాబు, ఎస్‌ఐ శివకుమార్, అమీన్, జైద్ యునూస్, జమీర్, మధుకర్‌రెడ్డి, శంకర్, పద్మనాభం, కృష్ణరాజు, మునీంద్రబాబు, సుధాకర్, చాంద్‌బాషా యోగంజల్‌రెడ్డి, రహంతుల్లా, సుధాకర్‌రమేష్, నాయుడు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

పులివెందుల టౌన్ : విద్యార్థులకు క్రీడలు మనోవికాసాన్ని కలిగిస్తాయని ఐసిటిసి కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య అన్నారు. మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా 6వ రోజు భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్. వై . నాగేంద్రమ్మ ఆధ్వర్యంలో వైఎస్‌విఆర్‌ఎం కళాశాల విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు దత్తత గ్రామమైన బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యకర మైన సలహాలను వివరిస్తూ, క్రీడలు నిర్వహించారు. కార్యక్రమంలో బాదల్ వల్లి, స్నేహిత పాల్గొన్నారు

మహిళా సాధికారతే ధ్యేయం : 'కొరముట్ల'



డ్వాక్రా సంఘాల మహిళలకు మెగా చెక్కును అందిస్తున్న కొరముట్ల

ప్రజాశక్తి-పుల్లంపేట

మహిళా సాధికారతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రజా పరిషత్ ఆవరణంలో వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత నగదు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 483 స్వయంసహాయక సంఘాలకు రూ.17 కోట్లు ఆసరా నిధులు ప్రభుత్వ మంజూరు చేసిందని అన్నారు. వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ నేతన్న నేస్తం ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతల్లోనే నగదును జమ చేశారని తెలిపారు. 2019 సార్వత్రిక ఎన్నికల నాటికి అక్కా చెల్లెమ్మలకు ఉన్న పొదుపు సంఘాల బ్యాంకు రుణాల మొత్తం సొమ్మును నాలుగు విడతలుగా పొదుపు ఖాతా ద్వారా సంఘాల మహిళలకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమం అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలు సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కొల్లం గంగిరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ హరినాథ్‌రెడ్డి, జడ్‌పిటిసి గీత, రామనాథం, స్థానిక సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, తహశీల్దార్ నరసింహాకుమార్, ఎంపిడిఒ రఘురాం, ఎస్‌ఐ రఘురాం, ఎపిఎం సుబ్బలక్షుమ్మ, సిద్దు, మల్లికార్జునరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

స్థానిక గాంధీనగర్‌లో విజ్‌డమ్ సిబిఎస్‌ఇ పాఠశాల విద్యార్థి ఎం.పునీత్‌రాయ్ జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలలో బంగారు పతకం సాధించాడని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ప్రదీప్,అడ్మిన్ డైరెక్టర్ మదన్మోహన్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతవారం కోయంబత్తూరులో స్వస్తిక్ ఇంటర్నేషనల్ స్పీడ్ స్కేటింగ్‌రింక్ వారు నిర్వహించిన అండర్-11 నేషనల్ స్పీడ్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్‌లో తమ విద్యార్థి పునీత్‌రాయ్ పాల్గొని బంగారు పతకం సాధించాడని చెప్పారు. క్రీడలు పిల్లలకు మానసిక ఉల్లాసంతో పాటు పోటీ తత్వాన్ని పెంచి జీవితంలో ఎదగడానికి తోడ్పడతాయని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కోటేశ్వరరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పునీత్‌రాయ్‌ను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్

విద్యార్థులకు వైద్య పరీక్షలు : డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ, అరవపల్లిలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా 6వరోజు మంగళవారం విద్యార్థులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎన్‌ఎస్‌ఎస్ పిఒ డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న, ప్రజలు స్థానిక విద్యార్థులను వైద్యులు పరీక్షించి మందులను అందజేసినట్లు తెలిపారు. ఎన్ ఎస్ ఎస్ కార్య కర్తలకు బ్లడ్ గ్రూపింగ్ చేసినట్లు తెలిపారు. డాక్టర్ కార్తిక్ విశ్వనాథ్, డాక్టర్ తారక్‌సాయి అనేక ఆరోగ్య సూత్రాలు, పాటించాల్సిన నియమాలు, నివారణా చర్యలు గురించి వివరించారు. కుష్టువ్యాధి పైన అవగాహన కలిగించారు. శిబిరంలో సిహెచ్‌ఒ వెంకట నారాయణ, స్థానిక ఆరోగ్య సిబ్బంది సులోచన, తులసి, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రమేశ్, సురేష్, కృష్ణుడు, వసంత్,కేశవరావు పాల్గొన్నారు. జడ్‌పి చేర్మెన్ ఆకేపాటి అమరనాథ్ రెడ్డి ఎన్‌ఎస్ ఎస్ కార్య కర్తలను అభినందించారు.

విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి : జడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి-నందలూరు

విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, ఎంపిపి మేడా విజయ భాస్కర్‌రెడ్డిలు సూచించారు. జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన అఫ్రీన్, ఆర్షియా,తస్లీమ్‌లను గొబ్బిళ్ళ అక్షర పాఠశాల యాజమాన్యం, ఆ పాఠశాలలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయస్థాయిలో ప్రతి ఏటా జరిగే నేషనల్ స్టూడెంట్ ఇన్నోవేషన్ చాలెంజ్ పోటీలలో 2023 -24 సంవత్సరానికి గాను బెంగుళూరు లో జరిగిన ఫైనల్స్ పోటీలలో విద్యార్థులు అఫ్రీన్, ఆర్షియా తస్లీమ్‌లు గోల్డ్ మెడల్ సాధించి నందలూరు కీర్తి ప్రతిష్టతలను మరోసారి పెంపొందించారని అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న కరెస్పాండెంట్స్ గొబ్బిళ్ళ త్రినాథ్, గొబ్బిళ్ళ శ్రీనాథ్, మెంటార్ వరప్రసాద్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ అనంత కృష్ణ, నాయకులు గడికోట వెంకట సుబ్బారెడ్డి, రాజంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పోలి మురళి, గీతాల నరసింహరెడ్డి, అరిగే సౌమిత్రి, ఆడపూరు సుబ్బారెడ్డి, ఇబ్బు, గంప సుధాకర్, గుణ యాదవ్, అజీజ్ సాహెబ్, మండల టీచర్స్ అసోసియేషన్ తరపున రౌఫ్‌బాషా, కృపానందం, హరినాథ్‌లు,విద్యార్థులు పాల్గొన్నారు.



గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న జడ్‌పి చైర్మన్

దళిత గ్రామాల్లో అభివృద్ధికి కృషి చేద్దాం



సమస్యలను అధికారులకు వివరిస్తున్న దళిత నాయకులు

ప్రజాశక్తి-పీలేరు

దళిత గ్రామాల్లో అభివృద్ధికి కృషి చేద్దామని పీలేరు తహశీల్దార్ ధనుంజయలు తెలిపారు. మంగళవారం మండలంలోని అగ్రహారం పంచాయతీ, ఆరెంవారిపల్లె ఎస్‌టికాలనీలో సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత గ్రామాలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పిస్తామని అన్నారు. దళిత నాయకులు మాట్లాడుతూ గ్రామంలో ఏడుగురు హౌసింగ్ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా పట్టాలు, బిల్లులు మంజూరు చేయలేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో వీధి దీపాలు లేకపోవడంతో చీకటిలో గడపాల్సిన పరిస్థితి నెలకొందని, వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. నీటి సమస్య ఎక్కువగా ఉందని, కొత్తగా బోరు, ట్యాంకు ఏర్పాటు చేయాలని కోరారు. వీధుల్లో రోడ్లు సగం వరకే ఏర్పాటు చేసి ఉన్నాయని, మిగిలినవి పూర్తి చేయాలని తెలిపారు. శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరారు. ఎస్‌టి కాలనీకి ఎలాంటి గుర్తింపులేదని, దీనికి చెంచులక్ష్మి కాలనీగా నామకరణం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డాక్టర్ మురళీమోహన్ రెడ్డి, ఎంఇఒ లోకేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ రమణ, ఎపిఒ, మహేశ్వర్, ఎఒ రమాదేవి, ఎంపిటిసి అమరనాథరెడ్డి, దళిత నాయకులు శ్రీనివాసులు, మల్లికార్జున, వెంకటేష్, సురేంద్ర, ఆనంద, నాగేంద్ర పాల్గొన్నారు.



షూటింగ్ చిత్రీకరణ ఏర్పాట్లలో యూనిట్ సభ్యులు

ఎర్రగుంట్లలో రజనీకాంత్ సినిమా చిత్రీకరణ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న తమిళ చిత్రం వెట్టయాన్ చిత్రీకరణ ఎర్రగుంట్ల పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. రెండు రోజులుగా నిర్వహిస్తున్న చిత్రీకరణ కోసం సూపర్‌స్టార్ రజనీకాంత్ ఎర్రగుంట్లకు చేరుకున్నారు. స్థానిక నిడుజివ్వి గ్రామం వద్దనున్న నాపరాయి క్వారీలలో ఫైట్ సన్నివేశాన్ని చిత్రీకరించారు. చిత్ర బృందం సోమవారం నాడే నాపరాయి క్వారీ వద్దకు చేరుకొని సన్నివేశానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మంగళవారం నుంచి హీరో రజనీకాంత్‌కు సంబంధించిన సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. రెండు రోజులపాటు చిత్రీకరణ జరుగుతుందని, ఒక సన్నివేశాన్ని స్థానిక సిమెంట్ కర్మాగారంలోని మైన్స్‌లో తీయనన్నట్లు సమాచారం. ఈ సినిమాను లైకా ప్రొడక్షన్స్ సారథ్యంలో జ్ఞానవేల్ రాజా దర్శకత్వం వహిస్తున్నారు. రజనీకాంత్, చిత్ర బృందానికి స్థానిక సిమెంట్ పరిశ్రమలో విడిది ఏర్పాట్లు చేశారు. సినిమా షూటింగ్ నిమిత్తం రజనీకాంత్ వచ్చాడనే సమాచారం తెలియడంతో ఆయన్ను చూడటానికి ప్రజలు తండోపతండాలుగా షూటింగ్ ప్రాంతానికి చేరుకున్నారు. స్థానిక పోలీసులు, రజనీకాంత్ సెక్యూరిటీ సిబ్బంది ప్రాంతం వైపు ఎవరిని వెళ్లకుండా నిలువరించారు.

'పది' విద్యార్థులకు శిక్షణ తరగతులు

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రొద్దుటూరు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి పరిధిలోని నడింపల్లి-1వ బాలుర వసతి గృహంలో 10వ తరగతి విద్యార్థులకు మార్చిలో నిర్వహించబోయే పరీక్షలకు సన్నద్ధులు కావాలని ఎఎస్‌డబ్ల్యూఒ గురుప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.సరస్వతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బంగారు భవిష్యత్తుకు పదవ తరగతి మొదటి మెట్టు అన్నారు. సమయాన్ని వృథా చేసుకోకుండా క్రమశిక్షణతో, పట్టుదలతో బాగా చదవాలన్నారు. మంచి ఫలితాలు సాధించి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ఎఎస్‌డబ్ల్యూఒ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థులకు వసతి గృహాల్లో ముందస్తుగా అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. ఉదయం, సాయంత్రం అదనంగా ఒక గంట పాటు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఎలా చదవాలి, ఎక్కువ మార్కులు వచ్చేందుకు అవగాహన కల్పిస్తున్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్స్ బ్రహ్మం, నాగరాజు, నాగరాజు నాయక్, వహీద్, బషీరా బేగం, శివలక్ష్మి, గురు జ్యోతి, అనిత, రామకృష్ణారెడ్డి, టూటర్స్ గురువయ్య, సుందరం, యమున,నీలిమ,నాగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

పులివెందుల రూరల్ : ఉచిత డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని శిక్షణ శిబిరం జనరల్ మేనేజర్ బాల గురవప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 5 నుంచి డ్రైవింగ్ లో ఉచిత శిక్షణ, జర్మనీలో ఉపాధి ముంబైకి చెందిన డిబి స్కిల్స్, ఐడియాస్ స్కిల్స్ సౌజన్యంతో పట్టణంలోని వైఎస్ఆర్ ఇస్తా ఆవరణలో ఇస్తారన్నారు. హెవీలైసెన్సు కల్గి, 40 ఏళ్లలోపు వయసు గల యువతీ యువకులకు ఉచితంగా 120 రోజుల శిక్షణ ఇస్తారని తెలిపారు. పూర్తి చేసిన వారికి జర్మనీ బాష నేర్పించి, జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశం రాష్ట్రంలోని ఏ ప్రాంతం వారైనా అర్హులే అని, ఆసక్తి గల యువతీ యువకులు 9966509364లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

చాపాడు : వివక్షతను ముగిద్దాం - గౌరవాన్ని స్వాగతిద్దాం అనే నినాదంతో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తామని చాపాడు వైద్యాధికారులు డాక్టర్ రాజేష్ కుమార్ తెలియజేశారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, చర్మంపై రంగు మారిన మచ్చలు ,పొడలు, లావుగా మారినలేక నొప్పితో కూడిన నరాలు, వంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే పరీక్షలు చేయిం చుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, డాక్టర్ కావ్యమాధురి, బద్రిపల్లె సర్పంచ్ భర్త గుత్తి నారాయణ, సిహెచ్‌ఒ మహాదేవయాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీని అందిస్తున్న కమిషనర్ మనోహర్

'ఆడుదాం ఆంధ్ర' విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా బాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో గెలుపు పొందిన విజేతలకు నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పి.ఆర్.మనోహర్ మాట్లాడుతూ క్రీడాకారుల సామర్థ్యాన్ని వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర క్రీడలు దిగ్విజయంగా జరిగాయని అన్నారు. ఈ క్రీడల్లో క్రీడాకారులు తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారని చెప్పారు.



విద్యార్థులతో ప్రిన్సిపల్, శిక్షకులు

వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-రామాపురం

ఉపాధి కల్పనకు వృత్తి విద్య ఎంతో దోహదపడుతుందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఎస్‌కెఎండి అప్రోచ్ బేగం పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి వసూల్ బ్యూటీ సెంటర్‌లో బ్యూటీ అండ్ వెల్నెస్‌పై మోడల్ స్కూల్‌లో విద్యను అభ్యసించే 8, 9, 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. వృత్తి విద్య ఉపాధ్యాయురాలు సురేఖ మెహందీ, ఫేస్‌వాష్ మేకప్ ఎలా చేయాలో చేసి చూపించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ వృత్తి విద్య నేర్చుకోవడం వల్ల చదువుతోపాటు ఉపాధి కల్పన లభిస్తుందని, మనతోపాటు ఇతరులకు జీవనోపాధి కల్పించగలుగుతామని పేర్కొన్నారు.

వైసిపి విజయానికి కృషి చేయండి

ప్రజాశక్తి-పీలేరు

వైసిపి విజయమే లక్ష్యంగా కృషి చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. పీలేరు పట్టణం ఆర్‌టిసి నల్లగుట్టకు చెందిన తాటిపత్రి లక్ష్మీదేవి రామకృష్ణను వైఎసిపి జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలుగా నియమించారు. మంగళవారం ఆమె తిరుపతిలో మంత్రిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసేవారికి సముచిత స్థానం ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని 99శాతం అమలు చేశారని అన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి ఘన విజయం సాధించడానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు.



మంత్రితో మాట్లాడుతున్న మహిళా నాయకులు

క్రైం కార్నర్



స్మగ్లర్ల కోసం సంద్ర అడవిలో వెతుకుతున్న పోలీసులు

ములకలచెరువులో గంజాయి సీజ్

-పోలీసు అదుపులో స్మగ్లర్లు

ప్రజాశక్తి-ములకలచెరువు

మండల పరిధిలోని మద్దినాయునిపల్లి పంచాయతీ వద్ద గల సంద్రడివిలో పోలీసులు మంగళవారం 50 కేజీల గంజాయి బస్తాలను సీజ్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు వివరాలు... మంగళవారం మధ్యాహ్నం సంద్రడవిలో గంజాయి బస్తాలను ఓ కారులో లోడ్ చేస్తుండగా, పక్కనే పొలం పనులు చేసుకుంటున్న రైతులు, పశువుల కాపర్లు వారి వద్దకు వెళ్లి కారులో బస్తాలు ఏమి వేస్తున్నారని నిలదీసినట్లు చెప్పారు. భయంతో గంజాయి బస్తాలను అక్కడే వదిలి కారులో స్మగ్లర్లు పారిపోయారని అన్నారు. రైతులు జరిగిన విషయాన్ని మలకలచెరువు పోలీసులకు సమాచారం అందించారని చెప్పారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ గాయత్రి హుటాహుటిన సంద్రడవి ప్రాంతానికి వెళ్లి గంజాయి బస్తాలను స్వాధీనం చేసుకొని స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కొంతమంది స్మగ్లర్లు పోలీ సులకు దొరికినట్లు సమా చారం. మరికొంతమంది స్మగ్లర్ల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తంబ ళ్లపల్లి నియోజకవర్గంలోని బి.కొత్తకోట పిటిఎం, ములకలచెరువు మండలాలలో ఎక్కువగా గంజాయి స్మగ్లింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా రాత్రి వేళల్లో సంద్రడవి ప్రాంతంలో రాత్రి వేళల్లో కార్లు సంచారం ఉందని, సంద్రడవి చుట్టుపక్కల గ్రామస్తులు చెబుతున్నారు.

నాటు తుపాకీ స్వాధీనం

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలం గుర్రంవాండ్ల పంచాయతీ నక్కలవారికోటలో నివాసమున్న పులిగారి సుధాకర్ అనే వ్యక్తి నుంచి ఎలాంటి అనుమతులు, లైసెన్స్ లేని నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-పీలేరు

పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం పీలేరు పట్టణంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ నరసింహుడు కథనం మేరకు వివరాలు ఇలావున్నాయి. పీలేరు పట్టణం, సదుం రోడ్డుకు చెందిన ఎస్.నూర్‌అలీ(30) అలియాస్ గిడ్డు అనే యువకుడు ఫోటో గ్రాఫర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడని చెప్పారు. అప్పులబాధతో అతను మంగళవారం పురుగుల మందు తాగాడని, విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బాధితుడిని హుటా హుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చారు. అక్కడ చికిత్స పొందుతూ ఫోటోగ్రాఫర్ మృతి చెందాడని పేర్కొన్నారు. మృతునికి ఏడు నెలల క్రితం వివాహమైందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.